అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

ఆదివారం 19, జూలై 2026 | సంపుటి : 03 | సంచిక : 151 | పేజీలు : 05 | వెల ₹5


## ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు
- ఉమ్మడి వరంగల్ జిల్లాల సమీక్షకు సమగ్రంగా సిద్ధం కావాలి
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

2



# కల్తీపై యుద్ధం

### ఆహార, ఔషధాల కల్తీపై కఠిన చట్టానికి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

- ప్రజల ప్రాణాలతో ఆడితే జైలే.. తెలంగాణలో రాబోతున్న సరికొత్త చట్టం
- విదేశాల్లో ఉన్న అత్యుత్తమ విధానాలపై అధికారుల అధ్యయనం
- ప్రజాభిప్రాయ సేకరణ తర్వాత అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టడం
- కల్తీల సమాచారం అందించేందుకు టోల్ ఫ్రీ నంబర్, విజిల్ బ్లోయర్ సిస్టమ్
- మొదటి దశలో 'క్యూర్' ప్రాంతంలో పైలట్ ప్రాజెక్ట్ అమలు



**అక్షరదర్బార్, హైదరాబాద్**

ప్రజల ఆరోగ్యాన్ని గుల్ల చేస్తున్న ఆహార, ఔషధాల కల్తీపై రాష్ట్ర ప్రభుత్వం యుద్ధం ప్రకటించింది. కల్తీలకు అడ్డుకట్ట వేసేందుకు అత్యంత కఠినమైన చట్టాన్ని త్వరలోనే తీసుకురానున్నట్లు ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నిత్యావసరాలు, కూరగాయలు, పండ్లు, పాలు.. ఇలా ప్రతిదీ కల్తీ అవుతుండటంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఎంసీహెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో తెలంగాణ ఆహార కల్తీ, ఔషధ నియంత్రణ చట్టం (టీజీఎఫ్ ఏడీసీఏ) పై ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

– వివరాలు 4లో..



## పారదర్శకంగా జరగాలి

- నిర్దేశిత గడువులోగా ఓటరు జాబితా సమగ్ర సవరణ పూర్తి చేయాలి
- రాష్ట్ర ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ హరి చందన దాసరి
- ఐదు జిల్లాల కలెక్టర్లతో సమీక్ష

2




## ఆత్మగౌరవ ప్రతీక పేరిణి నాట్యం

- కళలకు శాశ్వత వేదికగా కాళోజీ కళాక్షేత్రం
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

3

## ఎల్‌నినో ఎఫెక్ట్

- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- ప్రభావంపై అంచనాకు రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాటు
- నిపుణుల కమిటీ చైర్మన్‌గా జి చిన్నారెడ్డి నియామకం



3



## కొట్లాడటమే నా నైజం

- పదవులు అడుక్కోను..
- వెంకట్‌రెడ్డి వేరు.. నేను వేరు.. మా కుటుంబాలు వేరు
- అధిష్ఠానం హామీ ఇచ్చిన వారికే మంత్రి పదవులు.. నాకు రాలేదు
- కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు

2

## మిర్చి రైతులకు భారీ టోకరా

- భూపాలపల్లి జిల్లాలో రూ.90 లక్షల మిర్చి కుంభకోణం రట్టు
- ఇద్దరు నిందితుల రిమాండ్.. ఎస్పీ సంకీర్త్ అభినందనలు

3



# కల్తీపై యుద్ధం

## ఆహార, ఔషధాల కల్తీపై కఠిన చట్టానికి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

- ప్రజల ప్రాణాలతో ఆడితే జైలే.. తెలంగాణలో రాబోతున్న సరికొత్త చట్టం
- విదేశాల్లో ఉన్న అత్యుత్తమ విధానాలపై అధికారుల అధ్యయనం
- ప్రజాభిప్రాయ సేకరణ తర్వాత అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టడం
- కల్తీల సమాచారం అందించేందుకు టోల్ ఫ్రీ నంబర్, విజిల్ బ్లోయర్ సిస్టమ్
- మొదటి దశలో 'క్యూర్' ప్రాంతంలో పైలట్ ప్రాజెక్ట్ అమలు



అక్షరదర్బార్, హైదరాబాద్

ప్రజల ఆరోగ్యాన్ని గుల్ల చేస్తున్న ఆహార, ఔషధాల కల్తీపై రాష్ట్ర ప్రభుత్వం యుద్ధం ప్రకటించింది. కల్తీలకు అడ్డుకట్ట వేసేందుకు అత్యంత కఠినమైన చట్టాన్ని త్వరలోనే తీసుకురానున్నట్లు ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నిత్యావసరాలు, కూరగాయలు, పండ్లు, పాలు.. ఇలా ప్రతిదీ కల్తీ అవుతుండటంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఎంసీహెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో తెలంగాణ ఆహార కల్తీ, ఔషధ నియంత్రణ చట్టం (టీజీఎఫ్ ఏడీసీఏ) పై ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

### రసాయనాల విచ్చలవిడితనం

ఆకుకూరలు, కూరగాయలు, పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు, పండ్లు త్వరగా మగ్గేందుకు విచ్చలవిడిగా రసాయనాలు వాడుతున్నారని సీఎం మండిపడ్డారు. ఎరువులు, పురుగుల మందుల అధిక వినియోగం వల్ల పంటల్లో రసాయన అవశేషాలు మిగిలిపోతున్నాయని, దీనివల్ల కొన్ని విదేశాలు మన ఉత్పత్తుల దిగుమతులను నిరాకరిస్తున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

### సేంద్రియ మోసాలకు చెక్

మార్కెట్‌లో 'సేంద్రియ (ఆర్గానిక్) ఉత్పత్తులు' అంటూ అధిక ధరలకు విక్రయిస్తున్నారని, అవి నిజంగా సేంద్రియ ఉత్పత్తులేనా అని నిర్ధారించే సరైన వ్యవస్థలు ప్రస్తుతానికి లేవని సీఎం పేర్కొన్నారు. వీటన్నింటికీ అడ్డుకట్ట వేసేలా చట్టం ఉండాలన్నారు.

### విదేశీ విధానాలపై అధ్యయనం

కల్తీల నిరోధానికి ప్రపంచంలోనే సమగ్ర చట్టాలు అమలులో ఉన్న దేశాలను అధికారులు సందర్శించి, అక్కడి విధానాలను అధ్యయనం చేయాలని సీఎం ఆదేశించారు. ఆ నివేదికల ఆధారంగా సమగ్ర బిల్లును రూపొందించి, శాసనసభలో విస్తృత చర్చలు జరుపుతామని వెల్లడించారు. ఈ చట్టంపై ప్రజల నుంచి కూడా అభిప్రాయాలు సేకరించాలని సూచించారు.

### విజిల్ బ్లోయర్ వ్యవస్థ, టోల్ ఫ్రీ నంబర్

కల్తీలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించేందుకు, అక్రమార్కుల గుట్టు రట్టు చేసేందుకు ప్రత్యేక "విజిల్ బ్లోయర్" వ్యవస్థతో పాటు టోల్ ఫ్రీ నంబర్‌ను కూడా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.

### - పైలట్ ప్రాజెక్ట్‌గా 'క్యూర్'

ఈ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయడానికి ముందు, 'క్యూర్' ప్రాంతాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని సీఎం ఆదేశించారు. అక్కడ నిబంధనలు అమలు చేసి, ఎదురయ్యే లోటుపాట్లను సరిదిద్దుకుంటూ రాష్ట్రవ్యాప్తంగా ముందుకు సాగుతామని చెప్పారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్, ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు వి శేషాద్రి, ఎన్ శ్రీధర్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కొట్లాడటమే నా నైజం

- పదవులు అడుక్కోను..
- వెంకట్‌రెడ్డి వేరు.. నేను వేరు.. మా కుటుంబాలు వేరు
- అధిష్ఠానం హామీ ఇచ్చిన వారికే మంత్రి పదవులు.. నాకు రాలేదు
- కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు

అక్షరదర్బార్, హైదరాబాద్: రాష్ట్ర రాజకీయాల్లో సీనియర్ నేత, కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి శనివారం చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. తన పొలిటికల్ స్టైల్ ఏంటో స్పష్టం చేస్తూనే, మంత్రి పదవుల కేటాయింపు, తన సోదరుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో ఉన్న రాజకీయ సమీకరణాలపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. తనకు పదవులు అడుక్కోవడం తెలియదని, కేవలం ప్రజల కోసం కొట్లాడటమే తన నైజమని ఆయన స్పష్టం చేశారు.

### ఉప ఎన్నికల జ్ఞాపకాలు

గతంలో తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మునుగోడు ఉప ఎన్నికకు వెళ్లిన విషయాన్ని రాజగోపాల్‌రెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆ సమయంలో తన నియోజకవర్గానికి ఏకంగా 100 మంది ఎమ్మెల్యేలు తరలివచ్చారని, ఆ స్థాయి పోరాటం తన రాజకీయ జీవితంలో ఉందన్నారు. పదవుల కోసం తాను ఎప్పుడూ పాకులాడలేదని, ప్రజాక్షేత్రంలోనే తన బలం ఉ నిరూపించుకున్నానని తెలిపారు.

### మా కుటుంబాలు వేరు.. మంత్రి పదవిపై క్లారిటీ

రాష్ట్ర మంత్రివర్గంలో తన సోదరుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఉండటం, తనకు మంత్రి పదవి దక్కకపోవడంపై వస్తున్న వార్తలపై రాజగోపాల్‌రెడ్డి సూటిగా స్పందించారు. "కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నేను ఒకే కుటుంబం కాదు. మేమిద్దరం సోదరులమే కావచ్చు.. కానీ మా కుటుంబాలు వేరు" అని ప్రకటన చేశారు. మంత్రి పదవి విషయంలో వెంకటరెడ్డితో తనకేం సంబంధం లేదని ఆయన తేల్చిచెప్పారు. కాంగ్రెస్ అధిష్ఠానం గతంలో ఎవరికైతే హామీ ఇచ్చిందో, ఆ నేతలకే ఇప్పుడు మంత్రి పదవులు వచ్చాయని పేర్కొన్నారు. అయితే, సదరు సమీకరణాల్లో భాగంగా తనకు మాత్రమే మంత్రి పదవి ఇవ్వలేదంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు కాంగ్రెస్ వర్గాల్లో చర్చకు దారితీశాయి.



# పారదర్శకంగా జరగాలి

- నిర్దేశిత గడువులోగా ఓటరు జాబితా సమగ్ర సవరణ పూర్తి చేయాలి
- రాష్ట్ర ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ హరి చందన దాసరి
- ఐదు జిల్లాల కలెక్టర్లతో సమీక్ష


అక్షరదర్బార్, హనుమకొండ: ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ–2026 ప్రక్రియను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్, తెలంగాణ రాష్ట్ర 'శక్తి' శాఖ కార్యదర్శి హరి చందన దాసరి అధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లోని ఐడీఓసీ సమావేశ మందిరంలో హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిపై ఆమె జిల్లా వారీగా సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటి సర్వే, ఎన్యుమరేషన్ ప్రక్రియ, ఫారాల పంపిణీ–స్వీకరణ, మ్యాపింగ్, డిజిటలైజేషన్, అర్హులైన కొత్త ఓటర్ల చేరిక, అనర్హుల తొలగింపు వంటి అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు.

### సమీక్షలో హరి చందన దాసరి ముఖ్య సూచనలు

ఓటరు జాబితా సవరణపై ప్రజల్లో చైతన్యం తేవాలి. ఎవరు, ఎప్పుడు, ఎక్కడ, ఎలా దరఖాస్తు చేసుకోవాలో తరచుగా అడిగే ప్రశ్నల (ఎఫ్ఏక్యూ) రూపంలో ప్రచారం చేయాలి. ప్రత్యేక అవగాహన అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. శాశ్వతంగా నివాసం మారిన వారు, వలస వెళ్లిన వారు స్వచ్ఛందంగా వివరాలు నమోదు చేసుకునేలా చూడాలి. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, వెనుకబడిన ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలి. రాజకీయ పార్టీల నుంచి వచ్చే సూచనలు, ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి.

### ఐదు జిల్లాల పురోగతి వివరాలు

హనుమకొండ జిల్లాలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ వంద శాతం, డిజిటలైజేషన్ 68.13 శాతం, వరంగల్ జిల్లాలో డిజిటలైజేషన్ 71 శాతం, మహబూబాబాద్ జిల్లాలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ 100 శాతం, డిజిటలైజేషన్ 74.00 శాతం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో డిజిటలైజేషన్ 71.74 శాతం, ములుగు జిల్లాలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ 100 శాతం, డిజిటలైజేషన్ 75.60 శాతం జరిగింది. ఈ ఉన్నత సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ డా సత్య శారద, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, ములుగు జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్ జి, హన్మకొండ, వరంగల్ జిల్లాల అదనపు కలెక్టర్లు ఎన్ రవి, సంధ్యారాణి, సంబంధిత జిల్లాల ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.





# ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు
- ఉమ్మడి వరంగల్ జిల్లాల సమీక్షకు సమగ్రంగా సిద్ధం కావాలి
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

అక్షరదర్బార్, హనుమకొండ: ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు ముందస్తు కార్యాచరణ ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. శనివారం స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్‌తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, సంబంధిత శాఖలకు దిశానిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలకు సంబంధించి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధ్యక్షతన ఈ నెల 21న హన్మకొండ కలెక్టరేట్ లో ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్లు, అధికారులతో నిర్వహించనున్న సమీక్ష సమావేశానికి అన్ని శాఖలు సమగ్ర సమాచారంతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ప్రణాళిక, వ్యవసాయం, ఉద్యానవనం, భూగర్భ జలాలు, ఇంధన శాఖ, మున్సిపల్ పరిపాలన, పంచాయతీరాజ్, పశుసంవర్ధక, నీటిపారుదల తదితర శాఖలు తమ పరిధిలోని గత, ప్రస్తుత పరిస్థితులు, అందుబాటులో ఉన్న వనరులు, చేపట్టిన చర్యలు, ఎదురవుతున్న సవాళ్లు, భవిష్యత్ కార్యాచరణపై సమగ్ర నివేదికలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ల (పీపీటీ)ల రూపంలో సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనాలను దృష్టిలో ఉంచుకుని శాఖలన్నీ సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని, సమీక్ష సమావేశానికి పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి వెంకన్న, అదనపు కలెక్టర్ ఎన్ రవితో పాటు సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# 21న ఉచిత అయుర్వేద వైద్య శిబిరం

### అక్షర దర్బార్ జయశంకర్ భూపాలపల్లి

సింగరేణి భూపాలపల్లి ఏరియా ఆద్వర్యంలో డా.విశ్వనాధ మహర్షి, ఆయుర్వేద స్పెషలిస్టు నేతృత్వంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఈనెల 21 (మంగళవారం ) స్థానిక కృష్ణ కాలనీలోని సిఈఆర్ క్లబ్ నందు ఏర్పాటు చేయడం జరుగుతుందని భూపాలపల్లి ఏరియా ఇంచార్జ్ అధికార ప్రతినిధి విశ్రాంత్ కుమార్ తెలిపారు. ఈ ఉచిత ఆయుర్వేద వైద్య శిభిరం 21న ఉదయం 10 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు వరకు నిర్వహించబడుతుందని, ఈ శిబిరంలో చర్మవ్యాధులకు, మోకాళ్ళ నొప్పులకు, గుండె దడ, బిపి, షుగర్, థైరాయిడ్, మలబద్ధకం, అజీర్ణం, పక్షవాతం, అస్తమా, స్త్రీలకు సంబంధించిన వ్యాధుల నివారణ కోసం ఈ వైద్య శిభిరము ఉచితముగా నిర్వహించనున్నట్లు అధికార ప్రతినిధి తెలిపారు పూర్తి వివరాలకు డా.విశ్వనాధ మహర్షి, అయుర్వేద స్పెషలిస్టు సెల్ నెం : 9849574706 సంప్రదించగలరని అధికార ప్రతినిధి పేర్కొన్నారు.

# ఇంటింటికీ ఆరు మొక్కల పంపిణీ

అక్షరదర్బార్, నడికూడ: వన మహోత్సవం సందర్భంగా నడికూడ మండలం రాయపర్తి గ్రామంలో శనివారం ఇంటింటికీ ఆరు మొక్కల పంపిణీ కార్యక్రమం గ్రామ సర్పంచ్ రాజా జగత్ ప్రకాష్ ఆధ్వర్యంలో ప్రతి కుటుంబం ఆరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఆయన పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, నేడు నాటిన మొక్కలే భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందిస్తాయని అన్నారు. మొక్కలను నాటడమే కాకుండా అవి పెరిగే వరకు సంరక్షించాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చేలుమల్ల సురేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సంధ్య, ఫీల్డ్ అసిస్టెంట్ ఏరుకొండ యుగేందర్, మహిళా సమాఖ్య సీఏలు ప్రియాంక, కావ్య, పంచాయతీ కారోబార్ కోడెపాక సురేష్ తదితరులు పాల్గొన్నారు.





# ఆత్మగౌరవ ప్రతీక 'పేరిణి నాట్యం'

- కళలకు శాశ్వత వేదికగా కాళోజీ కళాక్షేత్రం
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

అక్షరదర్బార్, హనుమకొండ: తెలంగాణ అపూర్వ వారసత్వ సంపద, చారిత్రక నృత్యరూపం 'పేరిణి నాట్యం' మన రాష్ట్ర ఆత్మగౌరవానికి ప్రతీక అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కొనియాడారు. ఇలాంటి గొప్ప సాంప్రదాయ కళలను సంరక్షించి, భావితరాలకు అందించడం మనందరి బాధ్యత అని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర తెలుగు భాషా సాంస్కృతిక శాఖ, వరంగల్ నటరాజ కల కృష్ణ నృత్యజ్యోతి అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో గజ్జెల రంజిత్ కుమార్ నిర్వహించిన "పేరిణి నాట్య గురు–శిష్య పరంపర" వేడుకలకు ఎమ్మెల్యే నాయిని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన, కళాకారులు ప్రదర్శించిన అద్భుత నృత్యాలను తిలకించి ముగ్ధులయ్యారు.

**వీరుల్లో ధైర్యం నింపిన అపూర్వ కళ**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. కాకతీయుల కాలంలో యుద్ధానికి వెళ్లే వీరుల్లో ధైర్యం, ఉత్సాహం నింపేందుకు పేరిణి నాట్యం పుట్టిందని గుర్తుచేశారు. ఈ కళా సంప్రదాయాన్ని సజీవంగా ఉంచాలనే తపనతో కార్యక్రమాన్ని నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఈ సంస్కృతిని కాపాడుతున్న గురువులను, కళాకారులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

**- కళలకు శాశ్వత వేదికగా కాళోజీ కళాక్షేత్రం**

గతంలో నిలిచిపోయిన కాళోజీ కళాక్షేత్ర నిర్మాణాన్ని ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో, నిధులు మంజూరు చేసి కొద్ది నెలల్లోనే అందుబాటులోకి తెచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. ఇలాంటి వేదికల ద్వారానే యువతకు మన సంస్కృతి, సంప్రదాయాలు చేరువవుతాయని, తెలంగాణ వైభవం ప్రపంచానికి చాటిచెప్పబడుతుందని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో నటరాజ కళ కృష్ణ, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఉమా మహేశ్వరి, ధరావత్ రాజ్ కుమార్, విజయ రచనలతో పాటు పేరిణి నృత్య గురువులు, నాట్య కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.





# పిల్లల ఎదుగుదలలో తల్లిదండ్రుల భాగస్వామ్యం ముఖ్యం

## డీఈఓ రాజేందర్

అక్షరదర్బార్, చిట్యాల : విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతంగా ఎదిగేందుకు తల్లిదండ్రుల భాగస్వామ్యం అత్యంత కీలకమని జిల్లా విద్యాధికారి (డీఈఓ) రాజేందర్ అన్నారు. చిట్యాల మండలం జూకల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, నైపుణ్యాధారిత బోధన, సమర్థులైన ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారన్నారు. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించి, క్రమం తప్పకుండా పంపించాలన్నారు. నెలకు కనీసం ఒకసారైనా పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులతో పిల్లల చదువు, క్రమశిక్షణపై సంప్రదింపులు జరపాలని కోరారు. సమావేశంలో ఎంఈఓ రమేష్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నడికూడ సబ్‌స్టేషన్‌లో నేడు నాలుగు గంటలపాటు విద్యుత్ నిలిపివేత

అక్షరదర్బార్, నడికూడ : నడికూడ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనులు, కొత్త బ్రేకర్ ఏర్పాటు పనుల కారణంగా ఆదివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఏఈ ఎం. లక్ష్మణ్ తెలిపారు. దీనివల్ల నడికూడ, నర్సక్కపల్లి, చౌటపర్తి, ముస్త్యాలపల్లి, రాయపర్తి గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. పనులు పూర్తి కాగానే సరఫరాను పునరుద్ధరిస్తామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.



# మిర్చి రైతులకు భారీ టోకరా

- భూపాలపల్లి జిల్లాలో రూ.90 లక్షల మిర్చి కుంభకోణం రట్టు
- ఇద్దరు నిందితుల రిమాండ్.. ఎస్పీ సంకీర్త్ అభినందనలు




అక్షరదర్బార్, మొగుళ్ళపల్లి: అధిక ధరలు ఇప్పిస్తామని నమ్మించి మిర్చి రైతులను నిలువునా ముంచిన ఘరానా మోసం భూపాలపల్లి జిల్లాలో వెలుగుచూసింది. రంగాపూర్ గ్రామానికి చెందిన రైతుల నుంచి రూ.90 లక్షలకు పైగా విలువైన మిర్చిని కొనుగోలు చేసి మోసగించిన కేసులో ఇద్దరు ప్రధాన నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి కీలక పత్రాలు, 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు చిట్యాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి మల్లేష్ తెలిపారు. కేసు వివరాల్లోకి వెళ్తే.. గత జూన్‌లో మొగుళ్ళపల్లి మండలం రంగాపూర్ గ్రామంలో ఫర్టిలైజర్ షాప్ నిర్వహిస్తున్న బాల్త రాజు, మరికొందరు నిందితులతో కలిసి పక్కా స్కెచ్ వేశారు. జంగం రమేష్ (అగ్రాంపహాడ్), శతరాసి రాజు (అక్కంపేట), శతరాసి స్వప్నతో కలిసి గ్రామంలోని మిర్చి రైతులను సంప్రదించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే బస్తాకి రూ.2 వేల నుండి రూ.4 వేల వరకు అదనంగా ఇస్తామని ఆశ చూపారు. వారి మాటలు నమ్మిన రైతులు సుమారు రూ.1.20 కోట్ల విలువైన మిర్చిని వారికి అప్పగించారు. అయితే, నిందితులు రైతులకు కేవలం రూ.30 లక్షలు మాత్రమే చెల్లించి, మిగిలిన రూ.90 లక్షలు ఎగ్గొట్టి మోసానికి తెరలేపారు.

**రైతుల సొమ్ముతో విలాసాలు.. ఆస్తుల బదిలీ**

రైతుల నుంచి సేకరించిన మిర్చి బస్తాలను కత్తెరసాల వేణుగోపాల్ సహకారంతో అతని ట్రేడర్స్ పేరుపై ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లోని కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ చేశారు. అందులో కొంత మిర్చిని గుట్టుచప్పుడు కాకుండా విక్రయించి, వచ్చిన డబ్బుతో నిందితులు జల్సాలు చేయడమే కాకుండా కొత్త వాహనాలు కొనుగోలు చేశారు. తమపై కేసు నమోదైందని తెలియగానే, పోలీసుల నుంచి తప్పించుకోవడానికి తమ పేర్లపై ఉన్న స్థిరాస్తులను బొద్దు నాగరాజు పేరిట బదిలీ చేసి పరారయ్యారు. ఈ భారీ మోసంపై రంగంలోకి దిగిన సీసీఎస్ భూపాలపల్లి, మొగుళ్ళపల్లి పోలీస్ సిబ్బంది సంయుక్తంగా ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించారు. రంగాపూర్ గ్రామంలో నక్కిన జంగం రమేష్, శతరాసి రాజులను పట్టుకుని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి నిందితుల వ్యాపార సంస్థలైన ASK Agros, R-Enterprisesకు సంబంధించిన కీలక పత్రాలు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం వారికి రిమాండ్ విధించింది.

**ఎస్పీ అభినందనలు**

పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని, త్వరలోనే వారిని కూడా పట్టుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం జరిగేలా శ్రమించి, నిందితులను చాకచక్యంగా అరెస్ట్ చేసిన చిట్యాల సీఐ డి మల్లేష్, మొగుళ్ళపల్లి ఎస్ఐ ఎం సురేష్, సీసీఎస్ సీఐ రమేష్, ఎస్ఐ నరేష్, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ప్రత్యేకంగా అభినందించారు.

# ఎల్‌నినో ఎఫెక్ట్

- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- ప్రభావంపై అంచనాకు రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాటు
- నిపుణుల కమిటీ చైర్మన్‌గా జి చిన్నారెడ్డి నియామకం



అక్షరదర్బార్, హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులకు కారణమవుతూ, వ్యవసాయ రంగాన్ని కుదిపేస్తున్న 'ఎల్‌నినో' ముప్పుపై తెలంగాణ ప్రభుత్వం ముందస్తుగా అప్రమత్తమైంది. రాష్ట్రంలో ఎల్‌నినో వల్ల తలెత్తే పరిస్థితులను ఎదుర్కొనేందుకు, రైతాంగాన్ని ఆదుకునేందుకు ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఎల్‌నినో ప్రభావంపై సమగ్రంగా అధ్యయనం చేసి, కరవు నివారణ చర్యలను సూచించేందుకు రాష్ట్ర స్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

**చిన్నారెడ్డి నేతృత్వంలో కమిటీ**

ఈ ఉన్నత స్థాయి నిపుణుల కమిటీ చైర్మన్‌గా తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి చిన్నారెడ్డిని ప్రభుత్వం నియమించింది. వ్యవసాయ రంగంపై శాస్త్రీయ అవగాహన, సుదీర్ఘ రాజకీయ, పరిపాలనా అనుభవం ఉన్న ఆయన నేతృత్వంలో ఈ కమిటీ పనిచేయనుంది. అలాగే, ఈ కమిటీకి కన్వీనర్‌గా వ్యవసాయ శాఖ డైరెక్టర్‌ను నియమించారు. వాతావరణ, వ్యవసాయ రంగానికి చెందిన ఇతర నిపుణులు సైతం ఈ కమిటీలో సభ్యులుగా ఉండనున్నారు.

**కమిటీ ప్రధాన విధులు.. లక్ష్యాలు**

రాష్ట్రంలో వర్షపాత కొరత, భూగర్భ జలాల తగ్గుదల, సాగునీటి లభ్యత వంటి అంశాలపై ఎల్‌నినో చూపే ప్రభావాన్ని ఈ కమిటీ నిశితంగా అంచనా వేస్తుంది. ఒకవేళ వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే, ప్రత్యామ్నాయ పంటల సాగు విధానాలు, అందుబాటులో ఉన్న నీటి వనరుల సమర్థవంతమైన నిర్వహణ, పశుగ్రాసం కొరత రాకుండా చూసుకోవడం వంటి అత్యవసర కరవు నివారణ చర్యలపై ఈ కమిటీ ప్రభుత్వానికి స్పష్టమైన సిఫార్సులు చేయనుంది.

**రైతులకు దిశానిర్దేశం**

వాతావరణ మార్పులకు తట్టుకుని రైతులు నష్టపోకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ఈ కమిటీ కార్యాచరణను రూపొందిస్తుంది. ఎల్‌నినో వంటి ప్రకృతి సవాళ్లు ఎదురైనప్పుడు రైతాంగం నష్టపోకుండా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దెబ్బతినకుండా ఉండేందుకు ఈ కమిటీ ఇచ్చే నివేదిక అత్యంత కీలకం కానుంది. త్వరలోనే ఈ కమిటీ క్షేత్రస్థాయి పరిశీలనలు జరిపి, నిపుణులతో చర్చించి ప్రభుత్వానికి సమగ్ర నివేదికను సమర్పించనుంది.




# రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వ స్థాపనే లక్ష్యం

## పగడాల కాళీ ప్రసాద్ రావు

అక్షరదర్బార్, పరకాల : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు అన్నారు. పరకాల పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్ స్థాయి నుండి పార్టీని బలోపేతం చేస్తూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఓటరు సవరణలో ప్రతి అర్హుడి పేరు నమోదు చేయించాలని కోరారు. రైతు భరోసా నిధులు విడుదల చేసి, ఖరీఫ్‌కు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.